

యోగాసనంలో కలెక్టర్ వెట్రిసెల్వి

యోగాతో మానసిక ప్రశాంతత: కలెక్టర్

పెదపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా ప్రతి వ్యక్తికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ డవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో బుధవారం ఉదయం నిర్వహించిన యోగా కార్య క్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులతో కలిసి యోగాసానాలు వేశారు. ఆమె మాట్లాడుతూ యోగా ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పొందవచ్చన్నారు.ఈనెల 11న ద్వారకాతిరుమల, 19న పట్టిసీమలో యోగా కార్యక్రమాలు, 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఏలూరులో వెయ్యి మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. జేసీ అభిషేక్‌గౌడ, జడ్పీ సీఈవో జగదాంబ, డీపీవో మల్లికార్జునరావు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు ప్రాధాన్యం..

ఏలూరుసిటీ : జిల్లాలో రుణాల అర్హత కార్డులు కలిగిన ప్రతి కౌలు రైతుకు సాగుకు రుణ సౌకర్యం కల్పిం చాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా బ్యాంకర్ల సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 65 వేల మందికి పైగా కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు జారీ చేశామని , వీరిలో కేవలం 23వేల మంది కౌలు రైతులకు మాత్రమే రూ.375 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యానికి గాను కేవలం 124 కోట్ల రూపాయిలు మాత్రమే మంజూరు చేయడంపై బ్యాంకర్ల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో రైతులు, డ్వాక్రా మహిళలకు, విద్యార్థులు సైబర్ మోసానికి గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసేలా అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పుష్కరాల ఏర్పాట్లపై ప్రతిపాదనలు..

ఏలూరు క్రైం : జిల్లాలో గోదావరి పుష్కరాల సందర్భంగా సామాన్య భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ఏలూరు జిల్లాలోని పుష్కర ఘాట్లకు చేరుకునే రోడ్డు మార్గాల పరిస్థితి, రోడ్ల వెడల్పు, మరమ్మతులు, వాహన పార్కింగ్ ప్రదేశాలు గుర్తింపు, తదితర అంశాలపై ఎస్పీ కేపీఎస్ కిశోర్‌తో కలిసి కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పుష్కర ఘాట్లకు చేరుకునే రోడ్ల పరిస్థితి రోడ్ల వెడల్పు, మరమ్మత్తులు, వాహన పార్కింగ్ ప్రదేశాలు గుర్తింపు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఉండేలా రోడ్ల వెడల్పు, మరమ్మతులకు సంబంధించి సమాచారం అందించాలని రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను కోరారు. జేసీ అభిషేక్ గౌడ్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, ఇరిగేషన్‌శాఖల ఎస్‌ఈలు విజయరత్నం, రమేష్, దేవప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 30 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 48 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 18 మంది హాజరయ్యారని ఆర్‌ఐవో కె.యోహాన్ తెలిపారు.

కుమార్తె మరణాన్ని జీర్ణించుకోలేక
తండ్రి ఆత్మహత్య

భార్య ఆత్మహత్య..
భర్తకు ఎనిమిదేళ్ల జైలు

పశువుల దొంగల
ముఠా అరెస్టు 7



వేలేరుపాడు-రుద్రమ్మకోట రహదారిలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారి



ఎదవల్లి వద్ద ఇరువైపులా బీటీ వేసి మధ్యలో వదిలేసిన రహదారి

మూణ్ణాళ్ల ముచ్చట!

- రూ.ఐదు కోట్లతో రహదారుల నిర్మాణం
- నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు
- మూడు నెలలకే ధ్వంసమవుతున్న వైనం

వేలేరుపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దాదాపు 15 ఏళ్ల తర్వాత మండలంలో దెబ్బతిన్న రహదారుల పునఃనిర్మాణానికి ప్రభుత్వం రూ.ఐదు కోట్లు మంజూరు చేయగా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మేడేపల్లి నుంచి రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వరకు, రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు నుంచి రుద్రమ్మకోట వరకు, వేలేరుపాడు నుంచి రుద్రమ్మకోట వరకు, వేలేరుపాడు నుంచి కోయిదా వరకు రహదారుల పునఃనిర్మాణం పేరిట కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి పూర్తి చేయించారు. అయితే ఈ రహదారుల నిర్మాణం అతుకుల బొంతగా అక్కడక్కడ రోడ్లు తవ్వి తారువేశారు. మరికొన్ని చోట్ల రహదారి పూర్తిగా లేచిపోయినప్పటికి తారు వేయ లేదు. రహదారుల నిర్మాణం చేస్తున్నప్పుడే వీటి నిర్మాణం పట్ల స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఏ మాత్రం నాణ్యత పాటించకుండా కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా రహదారులను నిర్మించగా అవి ఇప్పుడు పాడైపోయి పూర్వ స్థితికి వచ్చేస్తున్నాయి. వెట్‌మిక్స్ లేచిపోయి తిరిగి గుంతలుగా ఏర్పడుతున్నాయి. రహదారిపై భారీ పగుళ్లు ఏర్పడి ద్విచక్రవాహనాలకు ఇబ్బందిగా మారుతున్నాయి. వేలేరుపాడు-రుద్రమ్మకోట రహదారిపై కొత్తగా నిర్మించిన తారురోడ్డు గుంతలుపడి లేచిపోతుండగా రుద్రమ్మకోట - రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వరకు నిర్మించిన రహదారిపై భారీ పగుళ్ల ఏర్పడ్డాయి. ఇదిలా ఉండగా వేలేరుపాడు, కోయిదా రహదారిపై వేసిన తారురోడ్డు అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించకుండా అక్కడక్కడ బిట్లుగా మాత్రమే నిర్మించి చేతులు దులుపుకున్నారు. మంజూరైన రూ.ఐదు కోట్లతో రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తారనుకుంటే అక్కడక్కడ మాత్రమే రహదారులను బిట్లుబిట్లుగా నిర్మించడం వెనుక భారీగా అవినీతి చోటు చేసుకుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి పనులు జరుగుతున్నప్పుడు దగ్గరుండి పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు - మిగతా 8వ పేజీలో

నైపుణ్య సిద్ధి.. ఉద్యోగ ప్రాప్తి!



జిల్లాలోని స్థానిక అవసరాలు, ఉపాధి వనరులకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. గత రెండేళ్ల నుంచి 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వివిధ శిక్షణలను నిర్వహిస్తోంది. రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేర్వేరు కంపెనీల్లో వేతనాలను కల్పించే ఉద్యోగప్రాప్తి చేపడుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్రణాళిక

- 18 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగులకు స్కిల్ హబ్స్‌లో శిక్షణ
- గతేడాది స్కిల్ హబ్స్ ద్వారా 711 మందికి ఉద్యోగాలు
- జాబ్ మేళాల నిర్వహణ.. గత రెండేళ్లలో 5,300 మందికి ఉపాధి



ఏలూరులో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళా దృశ్యం

నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఎక్కువ ఉద్యోగాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా యువతకు మొత్తం ఎనిమిది రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఎంచుకున్న రంగానికి తగ్గట్టుగా రెండు నుంచి మూడు నెలలు శిక్షణ ఉంటుంది. ఆయా రంగాల్లోని నిపుణులతో రోజుకు 4 గంటల పాటు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల దెందులూరు, ఏలూరు, ఉంగుటూరుల్లో నిర్వహించిన జాబ్ మేళాలకు స్పందన వచ్చింది. నిరుద్యోగులు కనీసంగా 250 మంది చొప్పున వివిధ ఉద్యోగాల తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

జిల్లాలో 13 ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్ల (ఈఎస్‌సీ) ద్వారా ఎనిమిది సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇస్తారు. పైథాన్, అకౌంటింగ్, ట్యాలీ, డిజిటల్ మార్కెటింగ్, హార్డ్‌వేర్ మెయింటెనెన్స్, ఈడీపీ, కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటివి నేర్పిస్తారు. స్థానిక డిమాండ్‌లు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తారు. కిసాన్ లోన్‌ఆపరేటర్, ఆర్గానిక్ గ్రోవర్, రిపేర్స్ అండ్ మెయింటెనెన్స్, ఎయిర్ టికెటింగ్ అండ్ రిజర్వేషన్, ఎయిర్‌పోర్టు గ్రౌండ్ ఆపరేటర్, కస్టమర్ - మిగతా 8వ పేజీలో

15,16న ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన


బుట్టాయగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి):ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి ఏజెన్సీ పర్యటనలో భాగంగా మన్యంలో కొలువైన గుబ్బల మంగమ్మను దర్శించుకోనున్నారు. చైర్మన్ ఈనెల 15, 16 తేదీల్లో కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో పర్యటించ నున్నట్టు అధికారులు తెలిపారు. 15న గుబ్బల మంగమ్మను దర్శించుకున్న అనంతరం చైర్మన్ జంగారెడ్డిగూడెంలో పర్యటిస్తారని అక్కడ ఏరియా ఆసుపత్రిని, గిరిజన గురుకులం పాఠశాలను సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యి సమస్యలు తెలుసుకుంటారన్నారు. వెలుతురువారిగూడెంలో పర్యటించిన ఆయన ఐటీడీఏ చేరుకుని గిరిజన నాయకులతో సమావేశమై ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. 16న ఏలూరులో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

రొయ్యల చెరువుల నీరు పంట కాలువలోకి వదిలితే చర్యలు : కామినేని

కైకలూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి):రొయ్యలు, చేపల చెరువుల నీటిని పంట కాలువల్లోకి వదిలితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని అన్నారు. బుధవారం కైకలూరు పీ4 కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంచినీటి సమస్యలు, పంటకాలువల అభివృద్ధిపై చర్చించారు. మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామస్థాయిలో పటిష్టమైన చర్యలను తీసుకోవాలన్నారు. కైకలూరు పంచాయతీలో వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వెలంపేటలో రైల్వే ట్రాక్ అవతలవైపున కొత్తగా పెద్ద నిర్మించి మోటార్లను ఏర్పాటుచేయాలని ముంపు సమయాల్లో పంచాయతీ సిబ్బంది ఆ మోటార్ల ద్వారా ముంపునీటిని పులవా డ్రెయిన్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, నాలుగు మండలాల ఎండీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు, డీసీ చైర్మన్లు పాల్గొన్నారు.

గరిష్ఠ ఉష్ణోగ్రతలు (సెంటీగ్రేడ్‌లో)

మండలం	బుధ	గురు	శుక్ర
ఆగిరిపల్లి	41.3	37.6	40.4
భీమడోలు	39.0	38.6	39.3
బుట్టాయిగూడెం	41.0	37.9	38.8
చాట్రాయి	40.7	36.7	38.9
చింతలపూడి	44.2	36.5	38.4
దెందులూరు	41.3	38.2	39.4
ద్వారకాతిరుమల	40.1	38.0	38.9
ఏలూరు అర్బన్	40.7	38.0	39.4
జంగారెడ్డిగూడెం	39.0	37.3	38.2
జీలుగుమిల్లి	41.0	37.0	38.0
కైకలూరు	40.3	38.8	39.0
కలిదిండి	40.2	39.1	38.8
కామవరపుకోట	41.7	37.3	38.8
కొయ్యలగూడెం	42.1	37.7	38.4
కుక్కునూరు	443.8	39.3	40.8
లింగపాలెం	41.6	37.0	38.9
మండవల్లి	40.8	38.5	39.3
ముదినేపల్లి	40.4	38.6	39.1
ముసునూరు	40.6	37.3	39.6
నిడమర్రు	39.0	39.0	38.7
నూజివీడు	40.5	37.6	40.2
పెదవేగి	41.3	37.6	39.4
పెదపాడు	41.3	38.1	39.6
పోలవరం	40.5	39.2	40.5
టి నరసాపురం	41.4	36.7	38.3
ఉంగుటూరు	42.4	38.9	38.7
వేలేరుపాడు	39.3	39.0	40.2



ఏలూరులో కురుస్తున్న భారీవర్షం

పగలు ఎండ.. రాత్రి వాన



(ఏలూరుసిటీ- ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం పగలు అత్యంత తీవ్రకరమైన వేడిగాలులతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏలూరు, పెదపాడు, జంగా రెడ్డిగూడెంలలో కుండపోత వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాగా ఉదయం జిల్లాలోని నాలుగు మండలాల్లో అత్యంత తీవ్రకరమైన వేడిగాలులు వీయడంతో పాటు వడగాడ్పుల జోరు కొనసాగింది. దీనికి తగ్గట్టుగా ఉక్కబోత పెరగడంతో జిల్లాలోని ప్రజలు విలవిలడారు. అత్యధికంగా చింతలపూడి మండలంలో 44.2 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైంది. ఈనెల 12న ఒక మండలంలో తీవ్రకరమైన వేడిగాలులు వీస్తాయని రాష్ట్ర విప త్తుల నిర్వహణ సంస్థ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9666909050
ఇ-వేలం అమ్మకం ప్రకటన

బడి పిలుస్తోంది!

రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

ఏలూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం శుక్రవారం నుంచి అన్ని పాఠశాలలను పునః ప్రారంభించడానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. తీవ్రమైన పగటి ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నా తొలుత ప్రకటించిన షెడ్యూలు ప్రకారమే పాఠశాలలను తెరవాలని నిర్ణయించింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు చేర్చగా, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోంది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఏలూరు జిల్లాకు పేలవమైన ఉత్తీర్ణత రావడంతో డీలాపడిన విద్యాశాఖ కొత్త విద్యాసంవత్సరంలో తొలిరోజు నుంచే సమగ్ర కార్యాచరణను ప్రారంభించాలని యోచిస్తోంది. కొత్త జిల్లాలకు ఉమ్మడి జిల్లా నుంచి టీచర్లను స్థానికత ఆధారంగా విభజించాలని ప్రభు త్వం నిర్ణయించడంతో ఈ ఏడాది సాధారణ బదిలీలు లేనట్టేనని స్పష్టతవచ్చింది. మొత్తంమీద ఈ ఏడాది బాలబాలిక లకు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సిలబస్‌తో కూడిన కొత్త పాఠ్య పుస్తకాలు పరిచయం కానుండగా, ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు(టెట్) భయం వెంటాడుతోంది.

పోటాపోటీగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేరికలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ఏటా గణనీయంగా పడిపోతోంది. జిల్లాలో మొత్తం 1,728 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 1,10,093 మంది ఉన్నారు. అన్నిరకాల ప్రైవేటు స్కూళ్ల 2,228 కాగా, వీటిలో చదివే బాలబాలికల సంఖ్య ఏకంగా 2,50,300 మంది ఉన్నట్టు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లోకి అడ్మిషన్ల కోసం టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 17నే ప్రారంభించినప్పటికీ బుధవారం వరకు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న బాలల సంఖ్య 7,314 మంది మాత్రమే. వాస్తవానికి జిల్లాలో ఐదేళ్లు పైబడిన బాలలు 20,300 మంది ఉండగా, వీరిలో కనీసం 11,200 మందిని ప్రభుత్వ బడుల్లో చేర్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ) కోసం చేరిన చిన్నారులంతా ఒకటో తరగతికి వచ్చేసరికి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి సముఖంగా లేకపోవడంతో అందరూ అవే ప్రైవేటు పాఠశాలల్లో కొనసాగేందుకు ఆసక్తి చూపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక - మిగతా 8వ పేజీలో